batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

22 సెప్టెంబర్ 2026
మంగళవారం


## మున్సిపల్ కార్పొరేషన్ పై ఏసీబి దాడులు

### లంచం తీసుకుంటూ ఉద్యోగుల పట్టివేత

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నిజామాబాద్ మున్సిపాల్ కార్పొరేషన్ లో పని చేసి రిటైర్డ్ అయినా ఉద్యోగి పెన్షన్ మంజూరు కోసం లంచం తీసుకుంటూ ఇద్దరు ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖకు చిక్కారు.



2 లో




2 లో

### పేదవాడి ఆత్మగౌరవమే

# ఇందిరమ్మ టవర్స్ లక్ష్యం

- పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే బోనాలు ఎత్తించేలా పనులు పూర్తి చేస్తాం
- ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంత ఇళ్లు.. ఉచిత రిజిస్ట్రేషన్‌తో హక్కులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ : హైదరాబాద్ మహానగరంలోని క్యూర్ పరిధిలో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలోని మల్కం చెరువు సమీపంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ పేదలకు వారు నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. పేదలను నగరానికి దూరంగా తరలించడం కాకుండా, ఖరీదైన ప్రాంతాల్లోనే గౌరవంగా నివసించేలా ఇందిరమ్మ టవర్స్ ను నిర్మిస్తున్నామని తెలిపారు.

### గణేష్ నిమజ్జనానికి

## ఎస్సారెస్పీ నీటి విడుదల



2 లో

గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దిగువ ప్రాంతం కోసం నీటి విడుదల చేశారు. ఇటీవల కాలంలో గణేష్ నిమజ్జనానికి చెరువులు, కుంటలు, బావుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో నిమజ్జనంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కరీంనగర్ జిల్లాలో ఎస్సారెస్పీ నీటి కోసం హిందూ సంఘాలు నీటి విడుదలను చేయాలని డిమాండ్ ను తెర మీదకు తెచ్చాయి. గతంలో ఎస్సారెస్పీలో 17 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ నిమజ్జనం కోసం నీటి విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

– నిజామాబాద్, బతుకమ్మ




### సాంప్రదాయ డప్పులు, వాయిద్యాలతోనే

## గణేష్ నిమజ్జనాలు చేయాలి

- కామారెడ్డి ప్రజలందరూ మన కుటుంబ సభ్యులుగా భావించాలి
- నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు తప్పవు
- డీజే నిర్వాహకులతో కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర

2 లో



2 లో

### వైద్య విద్యార్థిని అకీరాకు

## కేటీఆర్ ఆర్థిక భరోసా

### ఎంబీబీఎస్ చదువుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం

ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన కొండేటి అకీరాకు కేటీఆర్ అండగా నిలిచారు. ఎంబీబీఎస్ విద్యను కొనసాగించేందుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొండేటి భాస్కర్, అనిత దంపతుల కుమార్తె అకీరా. తుర్రూరులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి, ఖమ్మంలోని అంబేడ్కర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అకీరా జాతీయ వైద్య ప్రవేశ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 2,99,946 ర్యాంకు, ఎస్సీ విభాగంలో 27,865 ర్యాంకు సాధించింది. అనంతరం పటాన్‌చెరువులోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. అకీరా వైద్య విద్యకు సంబంధించిన ఆర్థిక ఇబ్బందుల విషయాన్ని జర్నలిస్ట్ బొల్లెపాక రాజేష్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

– హైదరాబాద్, బతుకమ్మ

### అక్రమ ఇసుక రవాణాపై

## కఠిన చర్యలు తీసుకోవాలి

- విజిలెన్స్ బృందాలతో నిరంతరం తనిఖీలు, దాడులు
- శాఖలో నియామకాలు, పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేయాలి
- రాష్ట్ర ఆదాయాన్ని పెంచేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి
- గనులు భూగర్భ వనరుల శాఖపై సీఎస్ సమీక్ష

2 లో



# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, బతుకమ్మ : రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు, అనధికారికంగా ఖనిజాల తరలింపును అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎస్ సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ పనితీరు, పరిపాలనా అంశాలు, ఆదాయ సమీకరణ, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు తదితర అంశాలపై సీఎస్ సమగ్రంగా సమీక్షించారు. శాఖ పరిధిలోని ఖనిజ వనరుల సమర్థవంతమైన వినియోగం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియలను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కొరత కారణంగా శాఖ కార్యకలాపాలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేపట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. శాఖలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా గనులు, భూగర్భ వనరుల శాఖను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే విధంగా సమన్వయంతో పనిచేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ జనరల్ (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్)డి.ఎస్. చౌహాన్, ఐటీఈ సీ సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ మైన్స్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి ఆత్మగౌరవమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యం



పేదవాడి సొంతింటి కలను కేవలం నాలుగు గోడలు, పైకప్పుతో పూర్తి చేయడం తమ ప్రభుత్వ లక్ష్యం కాదని, పేదవాడికి ఆత్మగౌరవంతో జీవించే చిరునామా ఇవ్వడమే లక్ష్యమని అన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ భారీగా ఉన్న ప్రాంతాల్లోనే పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎకరం వందల కోట్ల విలువ చేసే ప్రాంతంలో పేద కుటుంబాలకు ఇల్లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారికి భద్రత, భరోసా కల్పిస్తోందన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు 17 నుంచి 20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్‌తో పాటు అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, సేల్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించే విధంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని, ఎవరి సిఫార్సులు, ఒత్తిళ్లకు లొంగకుండా అర్హత ఆధారంగా ఎంపిక జరుగుతోందన్నారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు కూడా 'క్యూర్' ప్రాంతంలో లాటరీ ఎంపికలను పబ్లిక్‌గా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే పలుచోట్ల టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు వేగం పుంజుకుంటాయని చెప్పారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. "ఇక్కడ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి పేద కుటుంబం నిరాశ చెందాల్సిన అవసరం లేదు. రెండో విడత, మూడో విడత, నాలుగో విడత, ఐదో విడతగా కూడా ఇళ్లు నిర్మిస్తాం. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో 'క్యూర్' ప్రాంతంలో అర్హులైన పేదలకు దశలవారీగా ఇళ్లు అందిస్తాం" అని మంత్రి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించే విధంగా నిర్మాణాలను వేగవంతం చేస్తామని అన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదనీ, లబ్ధిదారులు తమ ఇల్లు ఎలా కడుతున్నారో మీ కళ్ల ముందే మీరు చూసుకోవచ్చు. వారానికి ఒకసారి వచ్చి నిర్మాణ పనులను పరిశీలించండి. నాణ్యతలో లోపం కనిపిస్తే అక్కడే ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయండి. ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. "ఇది ప్రభుత్వం ఇచ్చే ఒక గిఫ్ట్ కాదు.. మీ పిల్లలకు, మీ భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి. రాయదుర్గం వంటి ప్రాంతంలో 'నాకూ ఒక సొంత అపార్ట్‌మెంట్ ఉంది' అని మీ పిల్లలు గర్వంగా చెప్పుకునేలా ఈ ఇంటిని కాపాడుకోండి" అని మంత్రి కోరారు. గతంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి నగరానికి 30--40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన విధానాలకు భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డునే పేదలకు ఇళ్లు నిర్మిస్తోందని మంత్రి అన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదల ఇళ్ల విషయంలో ఇచ్చిన హామీలు, అమలు చేసిన పనులపై ప్రజలే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

# వైద్య విద్యార్థిని అకీరాకు కేటీఆర్ ఆర్థిక భరోసా



విషయం తెలుసుకున్న కేటీఆర్ స్పందించి, అకీరా చదువుకు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం తెలంగాణ భవన్‌లో అకీరాకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ అందజేశారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని పేర్కొంటూ, అకీరా భవిష్యత్తులో వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు.అంతేకాకుండా, అకీరా వైద్య విద్య పూర్తయ్యే వరకు భవిష్యత్తులోనూ అండగా ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ అందించిన ఆర్థిక సహాయంతో తన వైద్య విద్యను కొనసాగించేందుకు మరింత ధైర్యం వచ్చిందని అకీరా తెలిపింది. తన చదువుకు అండగా నిలిచిన కేటీఆర్‌కు అకీరా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ నిమజ్జనానికి ఎస్సారెస్పీ నీటి విడుదల

ప్రస్తుతం ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 46.654 టీఎంసీల నీరు ఉండడంతో ప్రభుత్వం నీటి విడుదలకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో సోమవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని శ్రీరాంసాగర్ నుంచి కాకతీయ మెయిన్ కెనాల్ (ఎల్ఎండిఎగువ భాగం)లోకి నీటి విడుదల ప్రారంభించారు. అనంతరం నీటి ప్రవాహాన్ని క్రమంగా పెంచుతూ సాయంత్రానికి 3 వేల క్యూసెక్కులకు పెంచడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

# అల్జీమర్స్ వ్యాధి వంశ పారంపర్యంగా వస్తుందా.. ప్రమాదం ఎంత వరకు ఉంటుంది..?

అల్జీమర్స్ వ్యాధి కుటుంబంలో ఎవరికైనా ఉంటే, తమకూ అదే వ్యాధి వస్తుందేమోనన్న ఆందోళన చాలామందిలో ఉంటుంది. అయితే కుటుంబ చరిత్ర ఉన్నంత మాత్రాన అల్జీమర్స్ తప్పనిసరిగా వస్తుందని చెప్పలేం. తల్లిదండ్రులు, తోబుట్టువులు లేదా దగ్గరి బంధువుల్లో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే ప్రమాదం కొంత పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కానీ వ్యాధి వచ్చే అవకాశాన్ని జన్యువులు మాత్రమే నిర్ణయించవు. వయసు, జీవనశైలి, గుండె ఆరోగ్యం, ఇతర ఆరోగ్య పరిస్థితులు, పర్యావరణ ప్రభావాలు కూడా అల్జీమర్స్ ప్రమాదంలో కీలకపాత్ర పోషిస్తాయి.

## ప్రమాదం ఎప్పుడు పెరుగుతుంది..

ఆలస్యంగా వచ్చే అల్జీమర్స్‌తో సంబంధం ఉన్న ముఖ్యమైన జన్యుపరమైన అంశాల్లో ఏపీఓఈ–ఈ4 జన్యు వైవిధ్యం ఒకటి. ఈ జన్యు వైవిధ్యానికి ఒక ప్రతిని కలిగి ఉన్నవారిలో అల్జీమర్స్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రెండు ప్రతులు ఉన్నప్పుడు ఆ ప్రమాదం మరింత పెరుగుతుంది.

అయితే ఏపీఓఈ–ఈ4 ఉండడం వ్యాధి నిర్ధారణకు సమానం కాదు. ఈ జన్యు వైవిధ్యం ఉన్నప్పటికీ చాలామందికి అల్జీమర్స్ రాదు. అదే సమయంలో అల్జీమర్స్ ఉన్న ప్రతి ఒక్కరిలోనూ ఈ జన్యు వైవిధ్యం ఉండాల్సిన అవసరం లేదు. అరుదుగా కనిపించే కుటుంబపరమైన అల్జీమర్స్‌లో ఏపీపీ, పీఎస్ఈఎన్1, పీఎస్ఈఎన్2 వంటి జన్యువుల్లో వచ్చే వారసత్వ మార్పులు బలమైన ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా 65 ఏళ్లలోపు వయసులోనే కుటుంబంలో పలువురికి వ్యాధి కనిపిస్తే ప్రత్యేక వైద్య పరిశీలన అవసరమవుతుంది.

## జన్యుపరమైన ప్రమాదం అంటే..

జన్యుపరమైన ప్రమాదం అంటే వ్యాధి కచ్చితంగా వస్తుందనే అర్థం కాదు. సాధారణంగా ఆలస్యంగా వచ్చే అల్జీమర్స్‌ను ఎవరికి తప్పకుండా వస్తుందో జన్యు పరీక్ష ద్వారా నిర్ధారించలేరు. ముఖ్యంగా ఏపీఓఈ స్థితిని తెలుసుకునే పరీక్షను ప్రతి ఒక్కరికీ సాధారణ పరీక్షగా చేయించుకోవాల్సిన అవసరం లేదు. పరీక్ష ఫలితాలను కుటుంబ చరిత్ర, వయసు, ఆరోగ్య పరిస్థితులు, ఇతర ప్రమాద కారకాలతో కలిపి అర్థం చేసుకోవాలి. జన్యు పరీక్ష చేయించుకోవాలనుకునేవారు దాని ప్రయోజనాలు, పరిమితులు, మానసిక ప్రభావాల గురించి నిపుణులతో చర్చించడం అవసరం.

## వయస్సు అత్యంత ముఖ్యం..

అల్జీమర్స్‌కు వయస్సు అత్యంత ముఖ్యమైన ప్రమాద కారకంగా కొనసాగుతోంది. వయసు పెరిగే కొద్దీ వ్యాధి వచ్చే అవకాశం పెరుగుతుంది. అయితే వృద్ధాప్యం అంటే అల్జీమర్స్ తప్పనిసరిగా వస్తుందని కాదు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం, శారీరకంగా చురుకుగా ఉండడం, సామాజికంగా, మానసికంగా చురుకుగా ఉండడం, ధూమపానానికి దూరంగా ఉండడం, తగినంత నిద్రపోవడం, సమతుల్య ఆహారం తీసుకోవడం వంటి చర్యలు మెదడు ఆరోగ్యానికి తోడ్పడతాయి. కుటుంబంలో అల్జీమర్స్ చరిత్ర బలంగా ఉన్నవారు లేదా చిన్న వయసులోనే పలువురికి ఈ వ్యాధి వచ్చిన సందర్భాలు ఉన్నవారు నిపుణులను సంప్రదించి తమ వ్యక్తిగత ప్రమాదాన్ని అంచనా వేసుకోవాలి. కుటుంబ చరిత్ర ప్రమాదాన్ని పెంచవచ్చు కానీ భవిష్యత్తును నిర్ణయించదని నిపుణులు చెబుతున్నారు.

# సాంప్రదాయ డప్పులు, వాయిద్యాలతోనే గణేష్ నిమజ్జనాలు చేయాలి

కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లాలో రాబోయే గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులకు సాంప్రదాయ డప్పులు, వాయిద్యాలతోనే నిమజ్జనాలు చేయాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. పోలీసు కార్యాలయంలో డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించిన ఎస్పీ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలోని ప్రతి ఒక్కరూ నా కుటుంబ సభ్యులేనని, డీజే ఆపరేటర్లు కూడా మన సభ్యులేనని మన అందరి క్షేమం, భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. మన కుటుంబ సభ్యులకు ఎవరికి కూడా డీజేల వల్ల ప్రాణహాని, ఇబ్బందులు కలుగవద్దని, వినాయక నిమజ్జనంలో ఎలాంటి అపశ్రుతులు జరుగకుండా ఉండేందుకు జిల్లాలో ఎక్కడా డీజేలకు అనుమతి లేదని నిర్వాహకులకు, డీజే ఆపరేటర్లకు స్పష్టం చేశారు. గతేడాది కూడా కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జనంలో ఎక్కడ కూడా డీజే ఉపయోగించకుండా సాంప్రదాయ డప్పులు, వాయిద్యాల, నృత్యాలతో ఎంతో వైభవంగా నిమజ్జనం నిర్వహించుకున్నామని అదే స్ఫూర్తిని ఈ యేడాది కొనసాగిద్దామని ఎస్పీ తెలిపారు. డీజేల వినియోగం నిషేదం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లో గణేష్ కమిటీలనుంచి అడ్వాన్స్ లు తీసుకోవద్దని ఎస్పీ ఆదేశించారు. ఎవరైనా డబ్బులు తీసుకుంటే వెంటనే సంబంధిత నిర్వాహకులకు తిరిగి చెల్లించాలని స్పష్టం చేశారు. ఎవరైనా డీజేలు ఏర్పాటు చేసినా నిర్వాహకులు, ఆపరేటర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవాల నిమజ్జనంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా జిల్లా పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రత చర్యలు చేపడుతుందని, ప్రజలందరూ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ కార్పొరేషన్ పై ఏసీబి దాడులు

నగరంలోని న్యాల్ కల్ చౌరస్తాలో రిటైర్డ్ ఉద్యోగి కొడుకు వద్ద రూ.15 వేల లంచం తీసుకుంటూ కార్పొరేషన్ లోని ఎస్టాబ్లిష్ మెంట్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ పాల్దే అశోక్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కలకుంట్ల కిరణ్ లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సోమవారం నిజామాబాద్ ఏసీబీ ఇంచార్జి డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సర్వీస్ బుక్ ను అడ్డం పెట్టుకుని పెన్షన్ మంజూరు కోసం డబ్బులు వసూల్ చేస్తూ బల్దియా సిబ్బంది ఏసీబీకి చిక్కడం కలకలం రేపింది. యేడాది కాలంలో మున్సిపల్ కార్పొరేషన్ పై దాడులు జరుగడం రెండవసారి. ఇద్దరిని అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. న్యాయస్థానం వారికి రిమాండ్ విధించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# రైతు హామీల అమలుకై కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర





## బోధన్ టూ జగిత్యాల 180 గ్రామాల మీదుగా సాగనున్న సైకిల్ యాత్ర..

### బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఈ నెల 27 నుంచి రైతుల హామీల అమలుకై కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు,దినేష్ పటేల్ కులాచారి తెలిపారు. సోమవారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి అధ్యక్షతన సైకిల్ యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఆ హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ ఆదేశాల మేరకు బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి బోధన్ నుండి ప్రారంభమై, అక్టోబర్ 4వ తేదీన జగిత్యాల వరకు దాదాపు 180 గ్రామాల మీదుగా కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. షరతులు లేకుండా రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేయాలని, అన్ని రకాల వడ్లకు బోనస్ అందించడంతో పాటు, మేనిఫెస్టోలో పేర్కొన్న 10 రకాల పంటలకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12,000 ఆర్థిక సాయం అందించాలని, పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని, నిజామాబాద్ నగరంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ (బోధన్), ముత్యంపేట్ చక్కెర కర్మాగారాలను తెరిపించాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్ పీవో) తగిన ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించాలన్నారు.రైతుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ సైకిల్ యాత్రలో అన్నదాతలు, పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల ఇందూర్ రైతాంగ కల అయిన జాతీయ పసుపు బోర్డును ప్రధాని నరేంద్ర మోదీ మంజూరు చేస్తే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాలయ నిర్మాణానికి స్థలం ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎరువులపై లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ భరిస్తూ, పీఎం-కిసాన్ ద్వారా ప్రతి ఏటా ఆర్థిక సాయం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను మోసం చేస్తుందన్నారు. రైతుల హక్కుల సాధనకై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ సైకిల్ యాత్రలో రైతులు, సంఖ్యలో కదలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చ నాయకులు వెల్మ గంగారెడ్డి, అంతిరెడ్డి హరీష్ రెడ్డి, తోట చిన్నయ్య, జిల్లా పదాధాకారులు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఐడిఓసి కాంప్లెక్స్ లో తల్లులు పిల్లలకు పాలిచ్చే క్యాబిన్లు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ ఐడిఓసి కాంప్లెక్స్ లో తల్లులు తమ చిన్నారులకు సౌకర్యవంతంగా, గోప్యతతో పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్లను ప్రారంభించారు. సోమవారం మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి గీత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రాజశ్రీ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారి సౌందర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, సందర్శకులు, ఐడిఓసి కాంప్లెక్స్‌కు వచ్చే తల్లులు తమ శిశువులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పాలిచ్చేందుకు ఈ క్యాబిన్లు ఉపయోగపడతాయని తెలిపారు. శిశువులకు తల్లిపాలు అందించడం వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో ముఖ్యమని, తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం




ఉందని పేర్కొన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, మహిళల సాధికారతకు సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. తల్లులు, శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇటువంటి



సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిచ్పల్లి సిడిపిఓ ఫర్హత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మహిపాల్, కుమారి ప్రణతి, స్వప్న, జెండర్ స్పెషలిస్ట్ లు, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షి లిటరసీ, అకౌంటెంట్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాకు లేని భూములు

# మీకెక్కడివి కేటీఆర్?

### కేసీఆర్ అన్న కూతురు రమ్య రావు




హైదరాబాద్, బతుకమ్మ : మా తాత మీ తాత ఒక్కడే. మా నాన్నకి లేని ఆస్తులు మీ నాయనకు ఎక్కడి నుంచి వచ్చాయని కేసీఆర్ అన్న కూతురు రమ్యరావు ప్రశ్నించారు. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తన ఆస్తుల గురించి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కేటీఆర్ తాము భూస్వాములమని తమకు ఆస్తులున్నాయని చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ వేశారు.మన తాత పేరు రాఘవరావు. ఆయనకు ఇద్దరు కొడుకులు రంగారావు, చంద్రశేఖర్ రావు అని, వందల ఎకరాలు తాతకు ఉంటే మా నాన్నకు ఎందుకు ఇవ్వలేదు? మీరే దోచుకున్నారా? నువ్వు అంటున్న వందల ఎకరాలు ఎక్కడ ఉన్నాయి? అని ఆమె ప్రశ్నించారు. నీ పెళ్లికి, నా పెళ్లికి ముందే మనకు ఉన్నది కేవలం 10--15 ఎకరాలు మాత్రమే అని ఆమె స్పష్టం చేశారు.

# నిమజ్జన శోభయాత్ర అనుమతికై ఏసీపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్, బతుకమ్మ :ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి గారి ఆదేశాల మేరకు..ఆర్మూర్ పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీవినాయక నిమజ్జన శోభయాత్రకు సౌండ్ సిస్టంను అనుమతినివ్వాలని కోరుతూకాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయి బాబా గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఏసీపి.వెంకటేశ్వర్ రెడ్డి ని సోమవారం కలిశారు. ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి ఆదేశానుసారం ఆర్మూర్ పట్టణం లో జరిగే శ్రీ వినాయక నిమ్మజన శోభ యాత్రకు రెండు టాప్(బాక్స్ )లు, ఒక బేస్(బాక్స్ ) లకు అనుమతి ఇవ్వాలని కోరారు. దాంతో ఏసీపీసీ సానుకులం గా స్పందించారని తెలిపారు. అనంతరం సీ. ఐ సత్యనారాయణ గౌడ్ కూడా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ గొనె రఘు, కౌన్సిలర్ లు నర్మె నవీన్ , గుపాల భుపెందర్ ,తాటి హన్మాండ్లు ,గంగాధర్ గౌడ్, నాయకులు బాబ్య్లా ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాలలకు 13 రోజుల పాటు దసరా సెలవులు




వెబ్ డెస్క్, బతుకమ్మ : తెలంగాణలో మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు. విద్యాసంస్థలకు చివరి వర్కింగ్ డే అక్టోబర్ 9. ఆ తర్వాత సెలవుల అనంతరం అక్టోబర్ 23వ తేదీనుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుకుంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు ఈ సెలవులు వర్తిస్తాయి. తప్పనిసరిగా అన్ని సంస్థలు వీటిని అమలు చేయాల్సి ఉంటుంది.

## ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీసే

### డీఎస్పీ మధుసూదన్



రాజంపేట్ , బతుకమ్మ :రాజంపేట మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో 3 లక్షల వ్యాయంతో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా వాటిని డీఎస్పీ మధుసూదన్ సోమవారం ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీసేనని అన్నారు. ప్రస్తుత వినాయక నిమజ్జనంలో ఎలాంటి డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ నరేష్, ఎస్ఐ భువనేశ్వర్, గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ముబారక్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన



నిజామాబాద్ రూరల్, బతుకమ్మ :జడ్పిహెచ్ఎస్ ముబారక్ నగర్ లో విద్యార్థిని, విద్యార్థులకు ఆయుర్వేదం పట్ల జిల్లా ఆయుష్ నోడల్ అధి,కారి డా. గంగాధర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమ వా రం 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలను పురస్కరిం చుకుని పాఠశాలలో ఆయుష్ శాఖ డైరెక్టర్, ఆయుష్ అర్ డి డి వరంగల్ ఆదే శాల మేరకు దినచర్య, ఋతుచర్య, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రపంచంలో ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యతను వివరిం చా రు. విద్యార్థిని, విద్యార్థులకు యోగా వైద్యులు డా.తిరుపతి యోగా సనా లు వేయించి యోగా వైద్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టార్ హనుమంతరావు, ఆయుష్ వైద్యులు డా క్టర్ ఫసియోద్దీన్, శ్రీవాణీ, ఆయుష్ ఫార్మసిస్ట్ పురుషోత్తం, ఉమా ప్రసా ద్, యోగా శిక్షకులు, పారామెడికల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 111 ఫిర్యాదులు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 111 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్, ట్రైనీ ఆర్డీఓ సందీప్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజి విగ్రహానికి నివాళ్ళు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నగరంలోని వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ మహనీయుల పార్కులో గల కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నాయకుడు కార్యదీక్షా పరుడు గొప్ప ఉద్యమ నేత బిసి ముద్దుబిడ్డ అయిన కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కొరకు చేసిన త్యాగాలను మరువలేనివన్నారు. ఒక శాసన సభ్యుడిగా, శాసనసభ ఉపనేతగా, మంత్రిగా, ఈ రాష్ట్రానికి ఎన్నో సేవలందించి తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి, తెలంగాణ వచ్చిన తర్వాతనే పదవులు తీసుకుంటానని శపథం చేసిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. తొంభై ఏళ్ల వయసులో కూడా విశ్రాంతి తీసుకోకుండా బస్సు యాత్ర చేసి యావత్ తెలంగాణ ప్రజానీకానికి తెలంగాణ ఉద్యమ పాఠాలు నేర్పిన గొప్ప నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. ఆనాడు స్వాతంత్రోద్యమంలో కానీ తెలంగాణ తొలి ఉద్యమంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాలు పంచుకుని ముందు వరుసలో ఉండి ఉద్యమాన్ని నడిపిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ అని అన్నారు. తన ఇంటిని తెలంగాణ ఉద్యమాలకు పుట్టినిల్లుగా మార్చి ఎందరికో వేదికగా తన ఇంటిని మార్చిన గొప్ప మార్గదర్శి కొండాలక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు, దర్శనం దేవేందర్, కొట్టూర్ చంద్రకాంత్, బగ్గలి అజయ్, సాయి బసవ, కోడూరు స్వామి, గంగాధర్, అంకం రావు, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ప్రజావాణికి 31 ఫిర్యాదులు




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 31 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్వీకరించారు. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని సీపీ తెలిపారు.

## గణేష్ శోభయాత్రకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : గణేష్ నిమజ్జనోత్సవ శోభయాత్ర శాంతియుతంగా సజావుగా నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అన్ని డివిజన్ పరిధిలలో ప్రధాన నిమజ్జన మార్గాల్లో దాదాపు 1300 మందికి పైగా పోలీస్ సిబ్బందిని నియమించామని, సి.సి కెమెరాల ద్వారా నిఘా డ్రోన్ కెమెరాలలతో పర్యవేక్షణ చేపట్టామని పోలీసు కమిషనర్ సాయిచైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ లలోని అన్ని గణేష్ నిమజ్జనోత్సం శోభయాత్ర సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాట్లు పోలీస్ సిబ్బందితో పాటు ఎక్సైజ్ శాఖ, ఫారెస్టు శాఖ, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ మొదలగు వారితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శోభయాత్రలో సందర్భంగా పలు సూచనలు చేశారు. నిమజ్జన ఊరేగింపులో శాంతి యుతంగా పాల్గొనాలని,అనుమానస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించి నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ట్రాఫిక్ నియ మాలు అందరూ పాటించాలని, ఆడియో సిస్టమ్స్ నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలని,డి.జేలు పూర్తిగా నిషేదమని, ఎటువంటి " రూమర్స్ " ( పుకార్ల) ను నమ్మరాదని, మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనడం తప్పు వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని, అత్యవసర సమయంలో 112 డయల్, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 87126-59700 సంప్రదించాలన్నారు. ప్రజలందరూ ఈ గణేష్ శోభయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీపీ తెలియజేశారు.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి







### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ : నీటి పారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నీటి పారుదల ప్రాజెక్టులకు అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు గుర్తు చేశారు. అయితే విడుదలైన నిధుల్లో సింహభాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు అందించకపోవడం పట్ల ఒకింత చేరకపోవడం ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్దిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధులు చాలకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోతే ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని సకాలంలో భూసేకరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సాహిత్య అధ్యయనం మానవత్వాన్ని మేల్కొల్పుతుంది

### మహాకవి గురజాడ జయంతి వేడుకల్లో ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల కొరవి గోపరాజు తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం "మహాకవి గురజాడ జయంతి" కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ "సాహిత్య అధ్యయనం మానవత్వాన్ని మేల్కొల్పుతుందని, మన మాతృభాషతెలుగును, తెలుగు కవుల కృషిని మరవకూడదన్నారు. తెలుగు విభాగం అధిపతి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి మాట్లాడుతూ సమాజాన్ని సాహిత్యం ద్వారా సంస్కరించిన మహనీయుడు, భాషను, ఛందస్సును, సరళతరం చేసిన మహా కవి గురజాడ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.ఎస్. రంగరత్నం, తెలుగు విభాగాధిపతి లెఫ్టినెంట్ డా.రామస్వామి, టీయూ ఈసి మెంబర్ డాక్టర్ దండుస్వామి, తెలుగు అధ్యాపకులు ఆర్. రాజేశ్వర్, కె.గంగాధర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శమంత, రాధిక, అర్చన, సుభాషిని దేవి, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




### రోడ్డు పై మొరం రోడ్డు వేయించిన

## ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్..



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామం నుండి సిద్ధాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు బురదమయంగా అస్తవ్యస్తంగా తయారయింది. దీంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయని, ఈ విషయాన్ని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ తన సొంత డబ్బులతో రోడ్డుపై మొరం వేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## గణేష్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి ఇవ్వండి

### కేసీఆర్ పాటలంటే సర్కారుకెందుకంత భయం

### బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

హైదరాబాద్, బతుకమ్మ : గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే వాహనాలకు అనుమతులు ఇవ్వాలని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డీజీపీ సీవీ ఆనంద్ కు విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదంటూ తనకు సందేశాలు వస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేసిన వెంటనే ఆ రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ జోక్యం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా డీజే వాహనాలకు అనుమతు లు మంజూరు చేసిన విషయాన్ని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. ఒక్క డీజే వాహనం కూడా సీజ్ చేయకూడదని పోలీసు శాఖకు లోకేష్ విజ్ఞప్తి చేశారన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కూడా అనుమతులు ఇచ్చారని, మహారాష్ట్రలో కూడా అక్కడి ఫడ్నవీస్ ప్రభుత్వం డీజే వాహనాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆయన వివరించారు. అలాంటిది తెలంగాణ రాష్ట్రంలో డీజే వాహనాలకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ఆయన నిలదీశారు. కేవలం భక్తులు వాహనాలపై కేసీఆర్ పాటలు పెట్టుకొని డ్యాన్స్ లు చేస్తున్నారన్న అక్కసు తోనే డీజేలకు అనుమతులు నిరాకరి స్తున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ పాటలంటే సర్కారుకెందుకంత భయమని ఆయన ఎద్దేవా




చేశారు. ఆర్మూర్ నుంచి అచ్చంపేట వరకూ గణేష్ నిమజ్జనంలో కేసీఆర్ పాటలే వినిపిస్తున్నా యన్నారు. ఇకనైనా సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి పరిమితులకు అనుగుణంగా గణేష్ నిమజ్జనం కార్యక్రమాలలో డీజేలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి






## సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రసాద్ వెల్లడి.

ఇందూర్, బతుకమ్మ : అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ కాలం గడపటం సరైనది కాదని పేదలకు ఇచ్చిన అస్సైన్ మెంట్ భూములను ఆక్రమించుకున్న రాజకీయ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల వద్ద ఉన్న భూములను వెలికి తీసి నిరుపేదలకు పంపిణీ చేయాలని అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తలు విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర నాయకులు బుర్రి ప్రసాద్ హాజరై మాట్లాడుతూ అధికార పార్టీ మీద, ప్రతిపక్ష నాయకులు, ప్రతిపక్షాల నాయకుల మీద అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు దూషణలతో కాలం వెలుబుచ్చుటం మూలంగా ప్రజలకు ఓనగోరే లాభం ఏమీ లేదన్నారు. లక్షలాదిమంది పేదలు ఇండ్లు ఇండ్ల స్థలాలు లేకుండా, అట్టడుగు వర్గాల ప్రజలకు సాగుభూములు లేకపోవడంతో రోజురోజుకీ పేదరికంతో సతమతమవుతున్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా ఎలినినో ప్రభావంతో రైతుల పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారని, బోరు మోటార్ల ద్వారా నీటిపారకం చేసుకునే రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. అందువల్ల నిరంతరాయంగా 24 గంటల విద్యుత్తును సరఫరా చేయటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేనియెడల ప్రభుత్వం పైన ప్రజలు రైతులు తిరుగుబాటు చేస్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు అధ్యక్షత వహించి జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీ మూసివేసిన నిజాం షుగర్ పరిశ్రమను కానీ, నిజామాబాద్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని ,కానీ తెరిపించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదన్నారు. నిజాంసాగర్ నీటిని, శ్రీరాంసాగర్ నీటిని ఆయకట్టు చివరి రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచి భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో పార్టీ ,ప్రజా సంఘాలు పోరాటాలకు సిద్ధపటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ద వెంకట రాములు, శంకర్ గౌడ్, వెంకటేష్, నాగన్న జిల్లా కమిటీ సభ్యులు సురేష్, జంగం గంగాధర్ ,వై. గంగాధర్, నన్నేసాబ్, కొండగంగాధర్, విగ్నేష్ ,తదితరులతో పాటు ఆయా మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# జెండా గుడిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



ఇందూరు, బతుకమ్మ : నగరంలోని జెండా బాలాజీ ఆలయాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకు న్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితికి ముందు ఇందూరులో జెండా ఉత్సవాలు నిర్వహించడం సాంప్రదాయ మన్నారు. ఎన్నో ఏళ్లుగా తాను జెండా జాతరలో పాల్గొంటున్నానని గుర్తు చేసుకున్నారు. జెండాను నగర పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగింపు తీయడం, బాలాజీ ఆలయంలో వారం రోజుల పాటు పూజించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, నాయకులు మారావార్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ సమైక్యతా సదస్సుకు కాసుల బాలరాజు పిలుపు

**అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి.**

**ఐక్యత, శాంతి, సోదరభావం కోసం కలిసి ముందుకు సాగుదాం.**

**ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు.**



బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలో ఈ నెల 27న నిర్వహించనున్న జాతీయ సమైక్యతా సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పిలుపునిచ్చారు. గంగా--జమునీ తహజీబ్‌కు ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ గొప్పతనం వివిధ మతాలు, భాషలు, సంస్కృతుల మధ్య ఉన్న పరస్పర గౌరవం, ఐక్యతలో ఉంద న్నారు. సమాజంలో శాంతి, ప్రేమ, సోదరభావం, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 27న ఆదివారం సాయంత్రం 7 గంటలకు బాన్సువాడ మార్కెట్ యార్డ్ గంజ్‌లో జాతీయ సమైక్యతా సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, సామాజిక, మత ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జాతీయ సమైక్యత, శాంతి, సోదరభావం, పరస్పర సామరస్యానికి సంబంధించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఫ్తీ ఉమర్ బిన్ ఈసా ఖాస్మీ, ముఫ్తీ నవీద్ ఖాస్మీ, కౌన్సిలర్ అబ్దుల్ ఖలీక్, బీర్కూర్ మాజీ ఎంపీపీ ప్రకాశ్, బీర్కూర్ మాజీ సర్పంచ్ రఘు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యమ రాములు, మాజీ వార్డు సభ్యుడు దాసరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# అనుమతి లేకుండా నిర్వహించిన డీజే సిజ్

## నిర్వకులపై కేసు నమోదు



నందిపేట్, బతుకమ్మ : నందిపేట్ మండల కేంద్రంలోని ఐలపూర్ గ్రామంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆదివారం రాత్రి డీజే నిర్వహించగా పోలీసులు వాటిని సీజ్ చేసి, నిర్వకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. పోలీస్ వారి అనుమతి లేకుండా ఎలాంటి డీజే లు నిర్వహించికూడదని, పోలీసుల ఆదేశాలకు అనుగుణంగా గణేష్ నిమజ్జనం చేస్తూ, ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించకుండా శాంతియుత వాతావరణం లోనిమజ్జనం జరుపుకోవాలని పోలీస్ వారు కోరారు.







# గ్రామ సభలో గందరగోళం...

**- గ్రామసభను అడ్డుకున్న గ్రామస్తులు....**

**- ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి...**

రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గత ప్రభుత్వ హయంలో నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అసంపూర్తిగా ఉన్నాయి. కాగా వాటిని పంపిణీ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆదేశాలు జారీ కావడంతో గ్రామ సభ నిర్వహించారు. తహసిల్దార్ తారాబాయి సమక్షంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన గ్రామసభ గందరగోళ పరిస్థితికి దారితీసింది. గ్రామంలో 150 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం చేపట్టారు. కానీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం 483 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఇళ్లలో మౌలిక వసతులు కరువయ్యాయి. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిచేసి నిరుపేదలకు పంపిణీ చేయాలని కొంతమంది నాయకులు సభా దృష్టికి తీసుకువచ్చారు. అయితే లబ్ధిదారుల పేర్లను ప్రకటించడానికి సిద్ధమవుతుండగా దీనిని గ్రామస్తులు అడ్డుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలని వారు తహల్దార్ ను ప్రశ్నించారు. చివరికి గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, తహసిలార్ తరాబాయి, డిప్యూటీ తహసిలార్ సురేందర్ నాయక్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్ లు కుల సంఘాలకే లబ్ధిదారుల బాధ్యత అప్పగించారు. దీంతో గ్రామసభ చివరికి ప్రశాంతంగా ముగిసింది.

# నేడు వైన్స్ షాప్ లు బంద్

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :
గణేష్ నిమజ్జనం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వైన్స్ షాప్ ల బంద్ నిర్వహిస్తున్నట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో వైన్స్ షాప్ లు, కల్లు దుకాణాలు, బార్ లు మూసివేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా ఈ నెల 22న ఉదయం 6 గంటల నుండి 23న ఉయం 6 గంటల వరకు మూసి వేయబడునని సీపీ తెలిపారు.




# గణేష్ నిమజ్జన శోభాయాత్రలో డీజే నిషేధం..

## - ఎస్సై మనోజ్ కుమార్...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండల కేంద్రంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగే గణేష్ నిమజ్జన ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా జరిగే శోభయాత్రలో డిజె సాంగ్స్ వినియోగించడం నిషేధం. కావున నిబంధనలు ఉల్లంఘించి డిజె సౌండ్స్ వినియోగిస్తే సంబంధిత ఉత్సవ నిర్వాహకులతో పాటు డీజే యజమానుల పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రుద్రూర్ ఎస్సై మనోజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు

## 2014 నియామక అధ్యాపకులకు పదోన్నతులు

## వైస్ ఛాన్సలర్ ఆచార్య యాదగిరిరావు

డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014లో నియమితులైన అధ్యాపకులు గత 8 సంవత్సరాలుగా పదోన్నతుల కొరకు ఎదురు చూస్తున్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వుల ఆధారంగా గత నెల 24వ తేదీన తెలంగాణ సెక్రటేరియట్ లో పూర్తి స్థాయి తెలంగాణ విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలి తొలి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ న్యాయ సలహా నివేదిక ఆధారంగా పదోన్నతులు కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యనిర్వాహక మండలి తీర్మానం మేరకు 29 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ లకు స్క్రీనింగ్ , ఎవాల్యూషన్ ధరఖాస్తులను ఈ నెల 17న క్లాస్ వన్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ రాష్ట్ర ఉన్నత విద్యాకార్యదర్శి డా . యోగితా రాణా, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సిక్తా పట్నాయక్, కాలేజియేట్ కమిషనర్ దేవసేనతో పాటుగా క్లాస్ టూ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ ప్రో.సి.హెచ్. ఆంజనేయులు, డా.సుధాకరగౌడ్ , డా. మదన్ మోహన్ , జయంత్ , లావణ్య , గాజి , సంజీవరావు , డాక్టర్ దండు స్వామి, రజనీకాంత్ లు ఆమోదించినారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ యాదగిరి రావు ఆదేశాలమేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అధ్యాపకులకు పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొ. యం.యాదగిరి లకు పదోన్నతి పత్రాలు అందుకున్న అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.



## పోస్టుమార్టం కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారు

### ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు

బోధన్, బతుకమ్మ : బోధన్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం వెళ్తే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ బోధన్ నియోజకవర్గ ఇంచార్జి ఎత్తొండ రాజేందర్ ఆరోపించారు. జిల్లా ఆసుపత్రిగా అప్ గ్రేడ్ అయిన బోధన్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం బాధిత కుటుంబ సభ్యులను సిబ్బంది వేదిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వివిధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తులు విషాదంలో కేసుల వలన పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి వస్తే డబ్బులు ఇవ్వకుండా పోస్టుమార్టం చేయడం లేదని డెడ్ బాడి ఇవ్వమని బెదిరిస్తున్నారని ఆరోపించారు. జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న వసూళ్ళ పర్వంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# బాన్సువాడలో వాటర్ ట్యాంకుల నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేను

రూ.52 కోట్ల అమృత్-2 నిధులు..
రెండేళ్లు గడిచినా పనులు నత్తనడక.
సగంలోనే ఆగిపోయిన ట్యాంకుల నిర్మాణం.. తుప్పు పడుతున్న సలాక
అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ నేతల ఆగ్రహం.
పనులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తునద ఉద్యమం చేపడతాం.
బీజేపీ నాయకులు డిమాండ్.

బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం మంజూరైన అమృత్-2 పథకం పనులపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బాన్సువాడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకులను బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి, ఇతర నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అమృత్-2 పథకం కింద రూ.52 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిధులు మంజూరై సుమారు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ పనులు పూర్తికాకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిధులతో బాన్సువాడ పట్టణంలో ఆరు వాటర్ ట్యాంకులు, పైపులైన్లు, పంప్‌హౌస్ తదితర పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. అయితే పలుచోట్ల వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోయాయని ఆరోపించారు. నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సలాకలు ఎండకు ఎండి, వర్షాలకు తడిసి తుప్పు పడుతున్నాయని పేర్కొన్నారు. పనులు ఆలస్యం అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన కీలకమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంకులు, పైపులైన్లు, పంప్‌హౌస్ పనులను పూర్తి చేసి బాన్సువాడ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. పనులు పూర్తి చేయడంలో



జాప్యం చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాన్సువాడ పట్టణ ప్రజల తరఫున బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని కొనాల గంగారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, నాయకులు చీకట్ల రాజు, కొండని గంగారం, పురుషోత్తం, మహేందర్, ప్రదీప్, పనేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సియుపిఎస్ పాఠశాలను సందర్శించిన ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు



బాన్సువాడ బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని సియుపిఎస్ పాఠశాలను తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సిబ్బందితో ఆయన మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం, పాఠశాల సమస్యలపై చర్చించారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్, కౌన్సిలర్ ఖలేఖ్ , కోఆప్షన్ సభ్యులు సుల్తానా గౌస్, పాఠశాల హెచ్ఎం మెరుగురాణి, మసూద్, శంబ్య నాయక్, సలాం , హర్ష , గాయత్రి, తదితర పాఠశాల సిబ్బంది



## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

### వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



హైదరాబాద్, బతుకమ్మ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను జిల్లాల వారీగా సమీక్షించారు. ఓటరు నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణకు సంబంధించి ఎన్నికల అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులపై అవసరమైన విచారణలను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. మ్యాపింగ్ జరగని వారికి, పేరు, ఇతర వివరాలలో వ్యత్యాసం కలిగి ఉన్న వారికి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించిన విచారణ పక్కాగా జరపాలన్నారు. ఇంకనూ ఎవరికైనా నోటీసులు జారీ కాకపోతే స్వయంగా బీఎల్ఓలు వెంటనే నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీ.ఎల్.ఏ ద్వారా నోటీసులు అందించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, నిర్ణీత గడువు లోపు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని సీ.ఈ.ఓ దృష్టికి తెచ్చారు. ధాన్యం దిగుబడులు మొట్టమొదటగా నిజామాబాద్ జిల్లాలో వస్తాయని, ఈ నేపథ్యంలో ఓ వైపు ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సన్నాహాలు చేపడుతూనే, సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.




# రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం ప్రమాదాలకు కారణం

### – కమ్మర్ పల్లి ఎస్సై సతీష్

కమ్మర్ పల్లి, బతుకమ్మ :మండల పరిధిలోని ప్రధాన ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులపై మక్కలు (మొక్కజొన్నలు), వడ్లు,ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టవద్దని కమ్మరపల్లి ఎస్ఐ సీ. హెచ్ . సతీష్ రైతులకు సూచించారు. రోడ్ల పై దాన్యం అరబెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం రోడ్లపై అరబోసిన ధాన్యం, మక్కలను పరిశీలించిన ఆయన ప్రెస్ తో మాట్లాడారు. రోడ్ల పై దాన్యం ఆరబెట్టడం వల్ల వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, రైతులు, వాహనాలు అదుపుతప్పి స్కిడ్ కావడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి ఘటనలు కొన్నిసార్లు ప్రాణనష్టానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రహదారులు ప్రజలు, వాహనాలు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు ఉద్దేశించినవని, వాటిపై వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాల ముప్పు పెరుగుతుందని ఎస్ఐ పేర్కొన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను రోడ్లపై కాకుండా కల్లాలు (డ్రైంగ్ యార్డ్స్ ), తమ వ్యవసాయ భూములు, వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఆరబెట్టుకోవాలని ఎస్సై రైతుకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు, రైతులు, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కమ్మర్ పల్లి మండల ప్రజలు, రైతులు సహకరించాలని ఎస్సై కోరారు.



# లింగంపేట్ మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

**సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు**

**వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు**




ఎల్లారెడ్డి, బతుకమ్మ : లింగంపేట్ మండలం కొరుపోలు గ్రామ శివారులోని నాగారంలో మహిళ హత్య కేసును చేదించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం నాగారం గ్రామానికి చెందిన చింతకుంట చంద్రవ్వ తన కుమార్తె అనుసూయ గత 10 సంవత్సరాలుగా కొరుపోలుకు చెందిన గుట్టమీది సాయిలుతో సహజీవనం చేస్తూ ఒక కుమారుడికి జన్మనిచ్చిందన్నారు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లోని గుండ్లపోచమ్మ వద్ద ఉన్న సమయంలో సాయిలు తన గ్రామానికి రావాలని బలవంతం చేస్తూ రాకపోతే చంపేస్తానని పలుమార్లు ఫోన్‌లో బెదిరించినట్లు మృతురాలి తల్లి చంద్రవ్వ తెలిపిందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 18న మధ్యాహ్నం సుమారు 2 గంటలకు భూమికి సంబంధించిన డబ్బులు వస్తాయని, పొలానికి మందు చల్లించాల్సి ఉందని చెప్పి ఆమె కుమార్తె అనుసూయ గుండ్లపోచమ్మ నుంచి బయలుదేరిందన్నారు. అనంతరం నాగారం గ్రామ శివారులో తలకు బలమైన గాయంతో రక్తస్రావమై మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఫిర్యాదురాలు లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో ఎల్లారెడ్డి సీఐ రాజా రెడ్డి సారథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ దర్యాప్తు చేపట్టగా నిందితుడు గుట్టమీది సాయిలును అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో మృతురాలిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడన్నారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం 19వ తేదిన ఉదయం 11 గంటలకు భూమి డబ్బుల విషయమై నిందితుడు మృతురాలిని తన ద్విచక్ర వాహనంపై కామారెడ్డికి తీసుకెళ్లి జుబేర్‌తో మాట్లాడించాడు. అనంతరం ఇద్దరూ తిరిగి మృతురాలి పొలం వద్దకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. అక్కడ ఇద్దరూ మాట్లాడుకుంటున్న సమయంలో నిందితుడు తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో మృతురాలిపై దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు గుట్టమీది సాయిలును అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. నిందితుడి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, రక్తపు మరకలున్న అంగి (దుస్తులు)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ప్రస్తుతం నేర విచారణలో ఉంది. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించడంలో కృషి చేసిన ఎల్లారెడ్డి సీఐ డి. రాజా రెడ్డి, లింగంపేట్ ఎస్సై దీపక్ కుమార్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

# దివ్యాంగ విద్యార్థులకు సహాయక ఉపకరణాల గుర్తింపు శిబిరం.

**- బాన్సువాడలో 100 మంది విద్యార్థుల గుర్తింపు.**

**- వైద్య నిపుణుల పరీక్షలు.**





బాన్సువాడ బతుకమ్మ : దివ్యాంగ విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి తగిన సహాయక ఉపకరణాలు అందించేందుకు బాన్సువాడలో సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. బాన్సువాడ డివిజన్‌లోని అన్ని మండలాల పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థుల కోసం బాన్సువాడ సరస్వతి కళ్యాణ మండపంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్య నిపుణులు దివ్యాంగ విద్యార్థులను పరీక్షించి, వారి శారీరక అవసరాలను అంచనా వేసి, విద్యాభ్యాసం, చలనశీలత, రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన సహాయక ఉపకరణాలను గుర్తించారు.

**100 మంది విద్యార్థుల గుర్తింపు.**

బాన్సువాడ మండలం నుంచి 23 మంది, బీర్కూర్ నుంచి 12 మంది, నస్రుల్లాబాద్ నుంచి 8 మంది, మిగతా మండలాల నుంచి 57 మంది చొప్పున మొత్తం 100 మంది దివ్యాంగ విద్యార్థులను సహాయక ఉపకరణాల కోసం గుర్తించారు.

**విద్యాభ్యాసానికి ఉపకరణాలు ఎంతో కీలకం.**

దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయక ఉపకరణాలు అందించడం ద్వారా వారి విద్యాభ్యాసం, స్వతంత్రంగా రోజువారీ కార్యకలాపాలు నిర్వహించడం, చలనశీలతతో పాటు స్వయం ఆధారిత జీవనానికి ఎంతో దోహదపడుతుందని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. శిబిరం నిర్వహణతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవసరమైన మార్గదర్శకత్వం లభించింది. ఈ కార్యక్రమంలో ఏఎల్ఐఎంసీఓ వైద్యులు డా. రాజశేఖర్ రెడ్డి, సహాయక సిబ్బంది, కామారెడ్డి జిల్లా ప్రత్యేక విభాగం కోఆర్డినేటర్ బి. నాగేందర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం. కృష్ణ చైతన్య, బాన్సువాడ మండల ప్రత్యేక ఉపాధ్యాయులు వసంత్ కుమార్, అనిల్, సాయి చరణ్, పద్మతో పాటు డివిజన్‌లోని అన్ని మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

# హత్యయత్నం కేసులో ముగ్గురికి ఐదేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష

**-గాయపరచ్చినందుకు ముగ్గురికి సంవత్సరం జైలుశిక్ష**

**-ఎస్ సి, ఎస్ టి చట్ట ప్రకారం నలుగురికి రెండేళ్ల జైలుశిక్ష**

**-నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల విచారణ న్యాయస్థానం**

**స్పెషల్ జడ్జి సుగాలి నారాయణ తీర్పు**

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ ఒక యువకుడిని కర్రలతో,ప్లాస్టిక్ పైపులతో, చెప్పులతో కొట్టి హత్యయత్నం చేసి, గాయపరచిన మొత్తం ఆరుగురికి జైలుశిక్షలు విదిస్తూ నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగలపై జరిగిన అత్యాచారాలను విచారించే స్పెషల్ జడ్జి సుగాలి నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దయాకర్ గౌడ్ తెలిపిన వివరాలు. నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మణ్ కొడుకు మృతి చెందడంతో అతని స్నేహితుడు దినేష్ అప్పుడప్పుడు వారి ఇంటికి వచ్చి వెల్లేవాడు. అవసరానికి అక్కరకువచ్చేవాడు. ఇలా మాటిమాటికీ దినేష్ లక్షన్ ఇంటికి రావడం జీర్ణించుకోలేని అదే గ్రామానికి చెందిన లచ్చోళ్ల నడిపి సాయిలు, లచ్చోళ్ల సాగర్, లచ్చోళ్ల నడిపి పెద్ద సాయిలు, లచ్చోళ్ల గణేష్,మెట్టు పెద్ద ముత్తన్న, మెట్టు అశోక్, రొడ్డ భోజన్న లు 2022,ఏప్రిల్ 19 రాత్రి దొమ్మిదిన్నర గంటల సమయంలో లక్ష్మణ్ ఇంటిపైకి రాళ్లు రూవ్వుతూ కర్రలు, ప్లాస్టిక్ పైపులతో, చెప్పులతో దినేష్ ను కొడుతూ,గ్రామం లోని గాంధీ విగ్రహం దగ్గరకు గుంజుకు పోయి అందరు కలిసి కులం పేరుతో దూషిస్తూ తిడుతూ, కొడుతూ హత్యయత్నం చేశారు. లక్ష్మణ్ కూతురు అరుణ పై కూడా దాడి చేసి కొట్టి గాయపరచినారనే నేర అభియోగాలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు అయినట్లు స్పెషల్ జడ్జి సుగాలి నారాయణ తీర్పులో పేర్కొన్నారు. లచ్చోళ్ల నడిపి సాయిలు, లచ్చోళ్ల నడిపి పెద్ద సాయిలు, లచ్చోళ్ల గణేష్ లకు హత్యయత్నం నేరం ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన జైలుశిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించారు. గాయపరచిన నేరంకు గాను లచ్చోళ్ల నడిపి సాయిలు, లచ్చోళ్ల నడిపి పెద్ద సాయిలు, లచ్చోళ్ల గణేష్, మెట్టు పెద్ద ముత్తన్న, నాటి గ్రామ సర్పంచ్ రొడ్డ భోజన్న లకు రెండు సంవత్సరాల జైలుశిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధించారు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల పై అత్యాచారాల చట్టం ప్రకారం లచ్చోళ్ల నడిపి సాయిలు, లచ్చోళ్ల నడిపి పెద్ద సాయిలు,లచ్చోళ్ల గణేష్, రొడ్డ భోజన్న లకు రెండు సంవత్సరాల జైలుశిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విదిస్తూ జడ్జి నారాయణ తీర్పు చెప్పారని పిపి దయాకర్ గౌడ్ వివరించారు. రెండవ ముద్దాయి నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న లచ్చోళ్ల సాగర్ విదేశాలకు వెల్లి ఉన్నందున అతనిపై నాన్ బెయిలెబుల్ అరెస్ట్ వారంట్ పెండింగ్ లో ఉన్నదని అతనిపై కేసును కోర్టు వేరు చేసిందని పిపి తెలిపారు. ఆ కేసును తరువాత కాలంలో కోర్టు విచారణ చేస్తుందని అన్నారు.

## మహిళ గొంతుపిసికి చంపిన కేసులో

# సాగర్‌కు జీవితఖైదు

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ : వరుసకు మేన కోడలు అయిన ఆకుల అనంతను అంతం చేసిన కేసులో పాండవుల సాగర్ కు జీవిత కారాగార శిక్ష విదిస్తూ నిజామాబాద్ నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి దారావత్ దుర్గా ప్రసాద్ తీర్పు చెప్పారు. తీర్పులోని వివరాల ప్రకారం మోస్రా మండల కేంద్రానికి చెందిన పాండవుల సాగర్ కూలిపని చేసుకుని జీవిం చేవాడు. కల్లుకు, మధ్యానికి అలవాటు పడ్డాడు. కుటుంబ పోషణకు, కల్లు,మద్యం తాగడానికి డబ్బులు సరిపోక అప్పులు చేశాడు. ఎంతకు అప్పులకుప్పలు తీరకపోవడంతో దుబాయ్ దేశానికి బతుకు తెరువు కోసం వెళ్ళాడు. తిరిగి దేశానికి వచ్చిన అతను ఇంటిని నిర్మించు కోవడానికి ఇందిరమ్మ ఇంటి పథకంకు దరఖాస్తు చేసుకోవడంతో ఇంది రమ్మ ఇల్లు మంజూరు అయింది. ఇంటి నిర్మాణంలో డబ్బుల అవసరం ఏర్పడి పెద్దన్నాన్న కూతురు అయిన నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ గ్రామ నివాసురాలు ఆకుల ఒడ్డెమ్మను ను పదిహేను రూపా యల అప్పు కావాలని అడిగాడు. బతకడమే కష్టంగా ఉంది డబ్బులు ఎక్కడికెలి తేవాలని ఆమె చెప్పింది. గతంలో ఒడ్డెమ్మ తండ్రి భూమయ్య చనిపోయినప్పుడు చిన్న నాన్న కొడుకైన సాగర్ కొడుకుగా అంత్య క్రియలు నిర్వహించి కొన్ని రోజులు మల్కాపూర్ (ఏ ) గ్రామంలో ఉన్నా డు. ఆ సందర్భంలో ఒడ్డెమ్మ కూతురు అనంత పైన ఉన్న బంగారు ఆభ రణాలు చూసిన సాగర్ తన ఆర్థిక అవసరానికి వాటిని దొంగలించాలనే దురాలోచన కలిగింది. అవసరానికి ఆదుకోని ఒడ్డెమ్మ మీద కోపం తెచ్చుకుని ఆమె ఇంటిలో లేని సమయంలో 2026 నవంబర్, 24 న ఒంటరిగా ఉన్న అనంతను ఇంటిలోకి వెల్లి గొంతుపిసికి హత్య చేశాడనే నేర అభియోగాలు రుజువు అయినట్లు జడ్జి దుర్గా ప్రసాద్ నిర్దారిస్తూ హత్య నేరంకుగాను జీవిత కారాగార శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించారు. దొంగతనం నేరంకుగాను ఒక సంవత్సరం జైలుశిక్ష రెండు వేల రూపాయల జరిమానా విధించారు.

## గణపతి మండపాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని పలు గణపతి మండపాలను మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల సోమవారం సందర్శించి, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా పోచమ్మగల్లిలో రవితేజ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణలోనే అతిపెద్ద 60 అడుగుల మట్టి గణపతిని గణేష్ బిగాల దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలాజీ భవన్, పూసలగల్లి లో అనంత పద్మనాభ స్వామి అవతారంలో ఏర్పాటు చేసిన గణపతిని దర్శించుకున్నారు. కిషన్‌గంజ్‌లోని శ్రీ కన్యకాపరమే శ్వరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని సందర్శించారు. గాజుల్‌పేట్ టానాగల్లిలో వైశ్య భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి, అలాగే మారుతినగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యా లతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సిర్ప రాజు, సత్య ప్రకాష్, దండు శేఖర్ జగత్ రెడ్డి ఆయా మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన రూట్ మ్యాప్ ఖరారు

## 8 ఫీట్ల పైన గణపతులు గోదావరికే

శోభాయాత్ర సంధర్భంగా 8 ఫీట్ల కన్న ఎక్కువ ఎత్తు గల విగ్రహాలు పాత రూటు ప్రకారంగా అనగా నెహ్రూపార్కు , అర్సాపల్లి , జాన్కంపేట్ , నవీపేట్ మీదుగా బాసర కు వెళ్ల వచ్చుని, 8 ఫీట్ల కంటె ఎత్తుగల విగ్రహాలను రూటు మరల్చడం జరిగిందని పోలీస్ కమీషనర్ సాయిచైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్కంపేటు నందు బ్రాడ్ గేజ్ రైలు హై టెన్షన్ రైల్వే లైన్ గలదని, కావున ఆ రూటు నందు 8 ఫీటుల కంటె ఎక్కువ ఎత్తు గల వాహనాలు వెళ్ళడం నిషేదించడం జరిగిందన్నారు. గణేష్ విగ్రహం 8 ఫీట్ లోపు గల విగ్రహాలను పాత రూటు ప్రకారంగా అనగా నెహ్రూపార్కు , అర్సాపల్లి , జాన్కంపేట్ , నవీపేట్ మీదుగా బాసర కు వెళ్లవచ్చున్నారు. నిజామాబాద్ నగరానికి చెందిన గణపతులు గాజుల పేట , శివాజీ నగర్, గోల్ హన్మాన్ , అంగడి బజార్, ఎల్లమ్మ గుట్ట , పూలాంగ్ , రాజారాజేంద్ర చౌరస్తా చూట్టు ప్రాంతాలు , సాయినగర్ , గాయిత్రి నగర్ , కోటగల్లి, హౌసింగ్ బోర్డు , బోర్గామ్ , న్యాల్కల్ , నాగారాం మొదలగు కాలనీల వారు పూలాంగ్ – ఎన్.టి.ఆర్ చౌరస్తా – రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, శివాజీ చౌక్, దుబ్బా, జి.జి కాలేజీ చౌరస్తా, బైపాస్ రోడ్డు, డీఎస్ చౌరస్తా, ముబారక్ నగర్, మాణిక్ బండార్, దాస్ నగర్, మాక్లూర్, నందిపేట్ ( ఉమ్మెడ గ్రామ సరిహద్దులో గల గోదావరి (బ్రిడ్జికి వెల్లవచ్చు) లేదా నవీపేట్, బాసర నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలో గణేష్ నిమజ్జన గోదావరి బ్రిడ్జికి వెళ్ళ వచ్చున్నారు. శోభాయాత్ర నిమజ్జనం ఆలస్యం లేకుండా , ప్రశాంతంగా విజయవంతంగా , ఆహ్లాద కరమైన భక్తి వాతావరణంలో జరగటానికి అన్ని గణేష్ మండలి నిర్వహకులు, భక్తులు, ప్రజలు అనునిత్యం సంబంధిత పోలీస్ వారికి సహకరించాలన్నారు.